క్లుప్తంగా

నూరు శాతం పన్నుల వసూలు



ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో నూరు శాతం పన్నులు వసూలైనట్టు కార్యదర్శి పులి స్రవంతి తెలిపారు. గ్రామంలో మంగళవారం సిబ్బందితో కలిసి ఆమె పన్నులు వసూలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలో ఇంటి పన్ను కింద రూ.2.50 లక్షలు, నల్లా పన్ను రూ.1.47 లక్షలు వసూలు పూర్తిగా వసూలైనట్టు చెప్పారు. ప్రజలందరూ పన్నులు చెల్లించి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపారని తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ కాసు యాకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



దుగ్గొండి : మండలంలోని రేకంపల్లికి చెందిన ఇజ్జగిరి రాంబాబు, ఇమ్మడి కుమారస్వామికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగే నర్సింగరావు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం నర్సింగరావు మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో రాంబాబు, కుమారస్వామిలకు రూ.60 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ నుంచి చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గట్టికొప్పుల నర్సింహస్వామి, ఆసాల అయిలయ్య, వలిగె సురేశ్, భిక్షపతి, రవి, రాజేశ్వర్‌రావు, కట్టయ్య, రాజాలు, జనార్దన్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పెద్దకోర్పోలుకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తాటిపర్తి నాగేంద్రమ్మ, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రామారపు శిరీష, నాయకులు సుబ్బారెడ్డి, ముద్రబోయిన శ్రీకాంత్, భీమన్న, మహ్మద్ అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం ఖరారు



పర్వతగిరి : స్థానిక తైబజార్ వేలం ఖరారైందని ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మాలోతు శంకర్‌నాయక్ ప్రకటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన తైబజార్ వేలంలో పలువురు పాల్గొని టెండర్ వేశారు. ఈ క్రమంలో నర్సంపేటకు చెందిన సింకేసి మహేందర్ రూ.10,01,200కు వేలాన్ని దక్కించుకున్నారు. అలాగే పంచాయతీకి చెందిన 20 షట్టర్లకు టెండర్ నిర్వహించడానికి ఏడాది కాలానికి రూ.6 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కాంప్లెక్స్ గదులకు వేలం వాయిదా

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామ పంచాయతీకి సంబంధించిన కాంప్లెక్స్‌లోని షట్టర్లకు వేలాన్ని ఎంపీడీఓ గుగులోతు కిషన్ నాయక్ వాయిదా వేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కాంప్లెక్స్‌లోని 3 గదులకు మంగళవారం వేలం నిర్వహించారు. పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తూ కిషన్ నాయక్ ప్రకటించారు. ఈనెల 27న మళ్లీ వేలం నిర్వహిస్తామని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, కారోబార్ గారె ఉపేందర్, సిబ్బంది కోల యాకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ



పర్వతగిరి : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)కి మండలంలోని బూర్గుమల్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడత శ్రీనివాస్ మంగళవారం బీరువా బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఎంఈఓ లింగారెడ్డి అభినందించారు. సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పర్వతగిరి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాక రమేశ్, చౌటపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఆచార్య ప్రద్యుమ్న, ఉపాధ్యాయుడు సంతోశ్, ఎంఎస్ శిల్పా, సీసీఓ జయరాజ్, సీఆర్‌పీలు ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండల్లో.. నీడపట్టున..

- ఎండు మిర్చితో పల్లెల్లో ఉపాధి

దుగ్గొండి : మండుటెండల్లోనూ నీడపట్టున పల్లెల్లో కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఎండుమిర్చి తొడిమెలు తీస్తూ ఏటా ఎండాకాలంలో సుమారు రెండు నెలలపాటు మండలానికి చెందిన పలు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. వివరాలిలా.. మండలంలోని తిమ్మంపేట, మహ్మదాపురం, మల్లిపల్లి, బొబ్బరోనిపల్లి, మల్లంపల్లి, చంద్రయ్యపల్లి, వెంకటాపురం, నాచినపల్లి గ్రామాల్లో సుమారు 2800 ఎకరాల్లో 2437 మంది రైతులు ఏటా మిర్చి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి కొంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర లేదు. అయితే పనుల్లేక వివిధ ప్రాంతాలకు వలస వెళ్లే కూలీలు ఎండు మిర్చితో ఉపాధి పొందుతున్నారు. ఎర్ర బంగారం సాగుతో కూలీలకు చేతి నిండా పని దొరుకుతోందంటే అతిశయోక్తి లేదు. మార్కెట్ యార్డుల నుంచి కొందరు స్థానికులు సొంత పూచికత్తుపై మిర్చి బస్తాలను ట్రాలీల్లో తీసుకొచ్చి కూలీలతో గ్రేడింగ్ చేయిస్తున్నారు. గిర్నిబావి, నాచినపల్లి, పానకల్, తొగర్రాయి గ్రామాల్లో ఇంటింటికీ మిర్చి బస్తాలు అందిస్తూ తొడిమెలు తీసిన తర్వాత తీసుకెళ్తున్నారు. తొడిమెలు తీసినందుకు గాను కిలోకు రూ.15–20 వరకు చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు 10–20 కిలోలు తొడిమలు తీస్తూ కూలీ సుమారు రూ.200–400 వరకు ఆదాయం పొందుతున్నారు. నీడ పట్టునే పని దొరుకుతుండడంతో కూలీలు ఆదాయ తక్కువైనా ఆనందంగా పని చేస్తున్నారు. మండలానికి చెందిన సుమారు 300–400 మంది ఏటా ఉపాధి పొందుతున్నట్టు తెలుస్తోంది. ఎర్ర బంగారం హమాలీలు, వాహనదారులకు సైతం ఆదాయం ఇస్తోందన్న వ్యాఖ్యలు సర్వత్రా వినవస్తున్నాయి.



మిరపకాయల తొడిమెలు తీస్తున్న కూలీలు

రోజుకు రూ.350 సంపాదిస్తున్నా

నేను, మరో ఇద్దరి కలిసి బస్తా మిరపకాయలు వేయించుకుంటున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ 50 కిలోల మిరపకాయల తొడిమెలు తీసినా వెయ్యి రూపాయల ఆదాయం వస్తోంది. ముగ్గురం రూ.350 చొప్పున తీసుకుంటున్నాం. ఇంటి వద్దే ఆరుబయట తాటి మట్టల పందిరి కింద చల్లటి వాతావరణంలో పని చేస్తున్నాం. ఏటా ఎండాకాలంలో నెల రోజులు పని చేసినా రూ.10 వేల ఆదాయం లభిస్తోంది.

– మల్లికాంబ, పానకల్

రెండ్రోజులకు 50 కిలోలు..

మా ఊరిలో ఓ ట్రక్కు యజమాని వరంగల్ నుంచి మిరపకాయల బస్తాలు తీసుకొచ్చి ఇళ్ల వద్ద అందిస్తాడు. నేను ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తొడిమెలు తీస్తున్నా. రెండ్రోజుల్లో బస్తా కాయలకు తొడిమెలు తీస్తుండగా రోజుకు రూ.500 గిట్టుబాటు అవుతోంది. మిర్చి తీసుకొచ్చి తొడిమెలు తీశాక తీసుకెళ్తున్నారు. ఆదాయం తక్కువైనా నీడలో మిరపకాయలు తొడిమెలు తీసే పని సౌకర్యంగా ఉంది.

– సరోజన, దుగ్గొండి

మొండి బకాయిలు వసూలు చేయండి

- డీసీసీబీ సీఈఓ నజీర్ సుల్తాన్

వర్ధన్నపేట : మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీసీబీ సీఈఓ నజీర్ సుల్తాన్ అన్నారు. మంగళవారం వర్ధన్నపేట డీసీసీబీ శాఖను ఆయన సందర్శించి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వర్ధన్నపేట శాఖలో తీసుకున్న మార్టిగేజ్, లాంగ్ టర్మ్, ఇతర రుణాల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఖాతాపై న్యాయపరమైన చర్యలు తీసుకుని రికవరీ చేయాలన్నారు. అదే విధంగా తీసుకున్న రుణం సకాలంలో చెల్లించకపోవడం వల్ల అధిక వడ్డీ, అదనపు చార్జీలు, లీగల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. రుణ బకాయిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా సిబిల్ స్కోర్ తగ్గడం వల్ల భవిష్యత్‌లో రుణ భారం అవుతుందన్నారు. ఈ అంశాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమీక్ష సమావేశంలో సేల్ ఆఫీసర్ స్రవంతి, మేనేజర్లు భద్రునాయక్, సమత, ఫీల్డ్ ఆఫీసర్ రంగు సురేశ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ స్వాతి బిందు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నజీర్ సుల్తాన్

అవగాహన కల్పించండి



గీసుకొండ : వేసవి నేపథ్యంలో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ రవీందర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. వేసవి కాలంలో నీటి, బంక విరోచనాలు తదితర ఆరోగ్య సమస్యలతో ప్రజలు సతమతమయ్యే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

- ఎస్సై చందర్

వర్ధన్నపేట : ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై చందర్ కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పలు వాహనాలకు సంబంధించిన, నడుపుతున్న వ్యక్తుల పత్రాలను పరిశీలించారు. బ్రీతింగ్ అనలైజర్‌తో వాహన చోదకులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహన చోదకులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. మద్యం సేవించి, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడపొద్దన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్సై రాజు

చలివేంద్రం ప్రారంభం

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు అవియుక్త్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని చెన్నారావుపేటలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, నాయకులు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, మంచాల సదయ్య, రూపిక శ్రావణ్‌కుమార్, మంద యాకయ్యగౌడ్, ఆవుల రాములు, బండి దిలీప్, ననుమాస కరుణాకర్, బొంత శ్రీనివాస్, కందిక సునీల్, మైబుసింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- అసోసియేషన్ అధ్యక్షుడు వేణు

నెక్కొండ : ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బిర్రు వేణు కోరారు. మండలవ్యాప్తంగా ఫొటో స్టూడియోలను మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో బంద్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం వేణు మాట్లాడారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో ఫొటోస్టూడియోల నిర్వహణ, మనుగడ ప్రశ్నార్థకంగా మారినట్టు తెలిపారు. ముడిసరుకుల ధరలు తగ్గించాలని, సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బోయిని ఏకాంబ్రం, కోశాధికారి మాదారపు వినోద్ కుమార్, గౌరవ అధ్యక్షులు దొనికెన రాజేందర్, తాటిపాముల వెంకటేశ్వర్లు, కుడికాల రఘువీర్, సభ్యులు అశోక్, శేఖర్, క్రాంతి, సుమన్, మధు, సతీశ్, రాము, వీరేందర్, గోపి, రమేశ్, లింగు, వీరన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు

రేపు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నర్సంపేట రూరల్ : రేపు (గురువారం) నర్సంపేట కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారులు కొమ్ము రమేశ్, పుట్టపాక రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు 2 చొప్పున నామినేషన్లు దాఖలైనట్టు పేర్కొన్నారు. ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో జనరల్ సెక్రటరీగా కంసాని అశోక్, కోశాధికారిగా రంగనాథస్వామి, ఈసీ సభ్యులుగా అజయ్, తిరుమల్, ప్రభాకర్, కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు వివరించారు.

నలుగురిపై కేసు

సంగెం : మండలంలోని నార్లవాయి గ్రామానికి చెందిన దామెర కిశోర్‌పై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు. వివరాలిలా.. కిశోర్ సోదరి ప్రభను ఎల్గూర్ రంగంపేటకు చెందిన ఇమ్మడి అఖిల్ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కుటుంబంలో గొడవలు చోటు చేసుకోవడంతో కిశోర్ తన సోదరిని నెల రోజుల క్రితం నార్లవాయికి తీసుకెళ్లాడు. కిశోర్ వల్లే ప్రభ కాపురానికి రావడం లేదంటూ ఆగ్రహానికి గురైన అఖిల్ తన స్నేహితులైన కుంటపల్లికి చెందిన చిర్ర అవినాశ్, సుదనపెల్లి దిలీప్, పుల్ల సంతోశ్‌లతో కలిసి కిశోర్‌పై మొండ్రాయి గొల్లపల్లి వద్ద మంగళవారం దాడి చేశాడు. ఈ క్రమంలో కిశోర్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

‘ఎస్ఆర్ఆర్’ సాయం

రాయపర్తి : మండలానికి చెందిన పలు కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయం అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఆదేశాలతో మండలంలోని రాయపర్తికి చెందిన ఐత షారోన్ కుమార్‌కు రూ.6 వేలు, మహబూబ్‌నగర్‌లో ఉండాటి సురేశ్ సతీమణికి రూ.3 వేలు సాయం ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి అందజేశారు. అనంతరం తిరుమ్మలాయపల్లిలో బొమ్మర ప్రమీల ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.3 వేలు అందజేశారు. అలాగే రాయపర్తిలో ఇటీవల మృతి చెందిన కస్రబోయిన సాయమ్మ కుటుంబానికి బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్, నాయకులు ఐత రాంచందర్, ఐత రాజు, రాము, రవీందర్, పీరని రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

సంగెం : మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కత్తి రాజిత(45) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందగా ఆమెకు పెద్ద కూతురు రచన తలకొరివి పెట్టింది. రజితకు భర్త రమేశ్, ఇద్దరు కూతుర్లు రచన, రవళి ఉండగా కుమారులు లేకపోవడంతో తల్లికి పెద్ద కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మొరం దందాకు అధికారుల వత్తాసు..!

- అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు
- గ్రామ పంచాయతీకి జేసీబీ అప్పగింత
- రెవెన్యూ, పోలీస్ శాఖలపై విమర్శలు

నర్సంపేట రూరల్ : మొరం దందాకు పాల్పడుతున్న అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నర్సంపేట మండలంలోని ఏజెన్సీ పరిధి గ్రామమైన రాజుపేటలో కొద్ది రోజులుగా అక్రమార్కులు ఇష్టారీతిన మొరం తవ్వకాలకు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో రైతులు, గ్రామస్తులు పలుమార్లు సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో విసిగిన గ్రామస్తులు మంగళవారం 35 మందితో అభివృద్ధి కమిటీ వేసుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో క్వారీలకు వెళ్లి మొరం తవ్వకాలు, రవాణాకు పాల్పడుతున్న జేసీబీ, ట్రాక్టర్లను, టిప్పర్లను అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు సమాచారం అందించారు. అయినా సంబంధిత అధికారులు గంటలు గడచినా రాకపోవడంతో టిప్పర్లను, ట్రాక్టర్లను, జేసీబీలను అక్రమార్కులు తప్పించారు. అయినా చివరకు ఒక జేసీబీని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా తండా పెద్ద మనిషి చేరాలు, రాజుపేట గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బానోత్ దస్రు మీడియాతో మాట్లాడారు. ఏజెన్సీ పరిధిలో అక్రమార్కులు నిబంధనలు ఉల్లంఘిస్తుండగా గ్రామస్తులు సమాచారం ఇచ్చినా పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎట్టకేలకు అభివృద్ధి కమిటీ వేసుకుని తామే అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకున్నా వస్తున్నామంటూనే అధికారులు కాలయాపన చేశారని ధ్వజమెత్తారు. పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు రాకపోవడంతో అక్రమార్కులు వాహనాలను తప్పించారని, ఒక జేసీబీని జీపీకి అప్పగించామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి మొరం దందాపై సమగ్ర విచారణ చేపట్టి అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పడిదల రవి, గౌరవాధ్యక్షుడు బాదావత్ వీరన్న, సభ్యులు బానోత్ లక్ష్మణ్, రమేష్, చేరాలు, వీరన్న, భద్రు, లక్ష్మణ్, మంజ్య తదితరులు పాల్గొన్నారు.



జేసీబీని జీపీకి అప్పగించి మాట్లాడుతున్న తండా పెద్ద మనిషి చేరాలు, కమిటీ అధ్యక్షుడు దస్రు

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- డీఎంహెచ్ఓ సాంబశివరావు

నర్సంపేట: ఆస్పత్రుల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ సాంబశివరావు హెచ్చరించారు. నియోజకవర్గంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రైవేట్ క్లినిక్, ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రికార్డ్స్ సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు, జరిమానా విధించనున్నట్లు తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కేంద్రాల్లో పరీక్షలు చేసే గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు.. నిర్ధారణకోసం వచ్చే కుటుంబ సభ్యులకు తగిన అవగాహన కల్పించి లింగ నిర్ధారణకు దూరంగా ఉంచాలని కోరారు. ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవసరమైతే తప్ప అనవసరపు శస్త్ర చికిత్సలు చేయకుండా సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఎండా కాలంలో నీళ్ల విరేచనాలు, బంక విరేచనాలు, చర్మవ్యాధులు, వడదెబ్బ వచ్చే అవకాశాలు ఉన్నాయని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా తగిన చికిత్సలు చేయించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీసీపీఎన్ డీటీ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది సమయ పాలన, హాజరు పట్టికను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ అరుణ్, మాత శిశు సంరక్షణ అధికారిని డాక్టర్ అర్చన, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

చట్టరీత్యా నేరం

ఖానాపురం : గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డీఎంహెచ్ఓ సాంబశివరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మాతాశిశు సంరక్షణ అధికారి అర్చన, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలిచ్చి వసతులు కల్పించాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 813లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి కరంటు, నీటి, ఇతర వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీపీడీపీఎస్ ప్రజాదండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జంగ రమేశ్ అధ్యక్షతన గుడిసెవాసులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రణయ్, రవి, విజయ్ దీక్షలను సందర్శించి మాట్లాడారు. నాలుగేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు సత్వరమే స్పందించి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు ఉప్పలయ్య, మాలతీ లత, రత్నం, రవి, విమల, విజయ, సమ్మక్క, సరోజన, విజయ, సుధారాణి, స్వరూప, నిర్మల, వనజ, రామకృష్ణ, నాగలక్ష్మి, రాజు, రాజమణి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్యతో సతమతం

- ‘రాజీవ్ యువవికాసం’ దరఖాస్తుల్లో వెతలు
- నిరుద్యోగ యువత పడిగాపులు

నల్లబెల్లి : సర్వర్ సమస్యతో నిరుద్యోగ యువత సతమతమవుతున్న పరిస్థితి మండలంలో నెలకొంది. రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల, ఆదాయ, ఇతర ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న యువతకు వెతలు తప్పడం లేదు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాసిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏప్రిల్ 5 వరకు రాజీవ్ యువవికాసం పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్న క్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రకటన విడుదలైన రోజు నుంచే పలువురు కుల, ఆదాయ, నివాస, ఇతర ధృవీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవడం మొదలైంది. ఈ క్రమంలో పలువురు యువతీయువకులు సర్టిఫికెట్లు ఇంకా అందకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులు, సిబ్బందిని కలుసుకున్నారు. ఇదిలా ఉండగా ధృవీకరణ పత్రాల జారీలో ప్రభుత్వ నిబంధన మేరకు తహసీల్దార్ డిజిటల్ సిగ్నేచర్ చేయాల్సి ఉండగా సర్వర్‌లో సమస్య తలెత్తింది. దీంతో సర్టిఫికెట్ల కోసం ప్రశ్నిస్తున్న యువతకు సమాధానం చెప్పడంలో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ సమస్య తొలగిపోగానే సర్టిఫికెట్లు జారీ అవుతాయని అధికారులు, సిబ్బంది చెబుతుండగా నిరుద్యోగ యువత అసహనానికి గురౌతున్నారు. సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందోనని పలువురు యువతీయువకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాసి దిగాలుగా వెనుతిరిగిపోవడం కనిపించింది.

ఆందోళన వద్దు



నిరుద్యోగ యువత ఆందోళన చెందవద్దు. రాజీవ్ యువవికాసం పథకం కింద సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు యువతీ యువకులు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కుల, ఆదాయ, నివాస, ఇతర ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో సర్వర్ ప్రాబ్లం చోటు చేసుకుంది. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నాం. త్వరలోనే సర్వస్ సమస్య తొలగిపోతుంది. దరఖాస్తులను అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు విచారించి నివేదిక ఇస్తున్నారు. సర్వర్ సమస్య పరిష్కారం కాగానే సర్టిఫికెట్లు జారీ చేస్తాం.

– ముప్పు కృష్ణ, తహసీల్దార్



తహసీల్దార్ కార్యాలయంలో వేచి ఉన్న యువత

సమస్యను సత్వరమే పరిష్కరించాలి

సర్వర్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా నరేశ్ మాట్లాడారు. అర్హులకు రుణాలు లభించేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న యువత సర్వర్, ఇతర సమస్యలతో విసిగిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కుల, ఆదాయ, ఇతర ధృవీకరణ పత్రాల దరఖాస్తులను అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు విచారించి అర్హులకు సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నెక్కొండ : గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండలంలోని పిల్లకాలుబోడు తండకు చెందిన ధరావత్ గణేశ్ (22) సుమారు నెల రోజుల క్రితం ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజు లుగా ఇరు కుటుంబాల నడుమ స్వల్ప గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో ఈనెల 20న గణేశ్ మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. గణేశ్ మృతితో తండాలో విషాదం నెలకొంది.



గణేశ్ (ఫైల్)